

ఆ గ్రామాలకే ప్రాధాన్యం

పార్వతీపురం, న్యూస్‌టుడే: మన్యంలో రహదారి సౌకర్యం లేక, రోగులు, గర్భిణులను డోలీలపై తరలించేందుకు యాతన పడుతున్న గ్రామాలకు రోడ్డు నిర్మాణ పనుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. గురువారం పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇప్పటికే మంజూరైన రహదారుల్లో అవసరం లేని వాటిని గుర్తించి రద్దుచేయాలన్నారు. వాటి స్థానంలో రహదారి సౌకర్యం లేని గ్రామాలకు వేయాలని సూచించారు.

మన్యం వయ్యారం.. పర్యాటక శోభితం

నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

కొండలు, గుట్టలు, నదీనదాలు.. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, జీవనశైలి, ప్రకృతి అందాల సమాహారం.. పార్వతీపురం మన్యం జిల్లా. ఏ మూల చూసినా.. ఇక్కడి అందాలు మనస్సును కట్టిపడేస్తాయి. గతంలో తెదేపా ప్రభుత్వం సీతంపేట, గుమ్మలక్ష్మీపురం, సాలూరు ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధికి నగిషీలు అద్దే పని చేపట్టింది. ఇంతలో వైకాపా సర్కారు వచ్చి గ్రహణం పట్టించింది. మళ్లీ ఇప్పుడు పట్టాలెక్కించే దిశగా జిల్లా యంత్రాంగం అడుగులు వేస్తోంది.
–న్యూస్‌టుడే, పార్వతీపురం, సీతంపేట



సీతంపేటలో ఎన్టీఆర్ సాహస పార్కు


అహో.. ఆడలి వ్యూ పాయింట్

సీతంపేట మండలం ఆడలి వ్యూ పాయింట్ సుందరంగా తీర్చిదిద్దారు. ఇక్కడ రెస్టారెంట్, నైట్ క్యాంపింగ్ టెంట్స్ వంటివి ఏర్పాటు చేశారు. రూ.10 లక్షలు వెచ్చిస్తే మరిన్ని సమకూరుతాయి. కాటేజీలు ఏర్పాటు చేసే దిశగా యోచిస్తున్నారు. సీతంపేటలో తితిదే వేంకటేశ్వరస్వామి దేవాలయం ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తోంది.



భళా సాహస పార్కు

సీతంపేటలోని ఎన్టీఆర్ సాహస పార్కుకు గత వైభవం తేనున్నారు. ప్రస్తుతం బుల్‌రైడ్, గైరో, ఆల్ టెర్రైన్ వాహనాలు పాడయ్యాయి. వాటికి మరమ్మతులు చేయిస్తున్నారు. పారా మోటారింగ్ ఆగిపోయింది. దాన్ని పునరుద్ధరిస్తే పర్యాటకులను మరింత ఆకర్షిస్తుంది. చాలా కాలంగా తెరుచుకోని 5 డీ థియేటర్‌ను సరిచేసి నేడు పునఃప్రారంభించనున్నారు. పార్కు అభివృద్ధికి ముఖ్యమంత్రి రూ.1.50 కోట్లు మంజూరు చేసినట్లు పీవో ప్రకటించారు.



జలపాతాల సవ్వడి

అటవీ శాఖ ఆధ్వర్యంలో కొన్ని ప్రాంతాలను పర్యాటకంగా తీర్చిదిద్దాలనే ప్రయత్నం జరుగుతోంది. సున్నపుగెడ్డ జలపాతాలను అభివృద్ధి చేయడానికి కార్యాచరణ రూపొందించారు. కురుపాం, పాలకొండ, సాలూరు రేంజ్ పరిధిలో కూడా పర్యాటక కేంద్రాలను గుర్తించి, దశల వారీగా వాటిని సుందరీకరించే ప్రయత్నం చేస్తున్నారు.

విదేశీ పక్షుల విడిది

సీతానగరం మండలం చెల్లంనాయుడువలసలో సైబీరియా పక్షులు ఏటా వస్తుంటాయి. విడిది స్థావరాలను ఏర్పాటు చేసి, సందర్శకులను ఆకర్షించేలా తీర్చిదిద్దాలి. తెదేపా హయాంలో దీన్ని అటవీ శాఖ, పంచాయతీరాజ్ సంయుక్తంగా అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించారు.


సాలూరులో జలపాతం

సదుపాయాలు కల్పిస్తే..

సీతంపేట మండలం దోనుబాయి దరి సున్నపుగెడ్డ, మల్లి, బెనరాయి వద్ద జలపాతాలు అభివృద్ధి, వాటి వద్దకు రహదారి సౌకర్యం, పర్యాటకులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తే ఆకర్షిస్తాయి.

గిరిజన మ్యూజియమో

సీతంపేట పీఎమ్మార్సీలో గిరిజన మ్యూజియం ఇప్పటికీ పూర్తి కాలేదు. గత తెదేపా ప్రభుత్వంలో ఈ పనులు ప్రారంభం అయ్యాయి. సేకరించిన వస్తువులు పాడవుతున్నాయి. ఏకో టూరిజం పనులు కూడా పూర్తి కావాల్సి ఉంది.

బహు సుందరం నర్సరీలు

గతంలో గుమ్మలక్ష్మీపురం మండలం తాడికొండ జలపాతాలు, సవరకోటతో పాటు హెచ్ ఎన్టీసీ నర్సరీలను పర్యాటకంగా మార్చే ప్రయత్నం జరిగింది. ఎస్.కె.పాడు నర్సరీ సుందరీకరణ ఐటీడీఏ నిధులు రూ.60 లక్షలతో చేశారు. యోగా శిక్షణాలయంగా రూపొందించారు. ఇక్కడి చెరువులను సుందరీకరించి, బోటు షికారును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇవన్నీ అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉంది.

బృహత్ప్రణాళిక

జిల్లాలోని పర్యాటక, ఆధ్యాత్మిక, విశిష్ట సందర్శనీయ ప్రాంతాలను దశల వారీగా అభివృద్ధి చేయడానికి మాస్టర్ ప్రణాళిక రూపొందించాం. అటవీ, పర్యాటక శాఖలు, ఐటీడీఏ సమష్టిగా భాగస్వాములవుతున్నాయి.
– ఎ.శ్యామ్‌ప్రసాద్, కలెక్టరు

అబ్బురం.. జగతిపల్లి హిల్ రిసార్ట్స్

మరో ఊటీని తలపించేలా సీతంపేట మండలం జగతిపల్లి వద్ద జగతిపల్లి హిల్ రిసార్ట్సు నిర్మాణానికి గత తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.27 కోట్లు మంజూరు చేశారు. మొదటగా రూ.7 కోట్లు విడుదల చేసి పనులు ప్రారంభించారు. తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం దీనిపై కక్ష కట్టినట్లు ఆపేసింది. తాజాగా కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టింది.


ఆడలి వ్యూ పాయింట్, నైట్ క్యాంపింగ్ టెంట్స్

రైతు సేవా కేంద్రాలకు గుబిల్లు


సీతానగరం మండలం పెదభోగిలిలో అద్దె భవనంలో నడుస్తున్న కేంద్రం

న్యూస్‌టుడే, పార్వతీపురం

సచివాలయ స్థాయిలో ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాల (పూర్వ ఆర్బీకే)కు విద్యుత్తు బిల్లుల చెల్లింపులో సందిగ్ధం నెలకొంది. ప్రధానంగా అద్దె భవనాల్లో కొనసాగుతున్న వాటికి ఎవరు చెల్లించాలనే విషయంలో అధికారులు తర్జనభర్జన పడుతున్నారు.

జిల్లాలో 306 రైతు సేవా కేంద్రాల్లో 50 శాతానికి పైగా అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఒక్కో భవనానికి నెలకు రూ.700 నుంచి రూ.1,000 వరకు విద్యుత్తు బిల్లు వస్తోంది. సగటున రూ.850 వేసుకుంటే నెలకు రూ.1.27 లక్షల వరకు అవుతోంది. ఈ విషయాన్ని ఆ శాఖ జిల్లా అధికారి రాబర్ట్‌పాల్ ఇటీవల కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లి అందుబాటులో ఉన్న నిధులు ఇవ్వాలని కోరారు. ప్రైవేటు భవనాలకు సంబంధించి ఎటువంటి నిర్ణయం తీసుకోలేమని ఆయన స్పష్టం చేశారు.

కమిషనరు నుంచి లేఖ

అద్దె భవనాలకు వస్తున్న విద్యుత్తు బిల్లుల సమాచారాన్ని మండలాల నుంచి సేకరిస్తున్నాం. వీటిని క్రోడీకరించి వ్యవసాయ శాఖ కమిషనరుకు నివేదిస్తాం.
– రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయాధికారి

మనకు కుంకీలొస్తాయా!

న్యూస్‌టుడే, పార్వతీపురం

పార్వతీపురం మన్యం జిల్లాలో రెండు గుంపుల ఏనుగులు సంచరిస్తున్నాయి. వాటి కారణంగా ప్రాణాలకు, పంటలకు తీవ్ర నష్టమే వాటిల్లుతోంది. రాష్ట్రంలో చిత్తూరు తర్వాత ఏళ్ల తరబడి జిల్లాలోనే గజరాజుల బెడద ఎక్కువగా ఉంది.

కర్ణాటకతో ఒప్పందం

చిత్తూరు, మన్యం జిల్లాల్లో కరిరాజుల వల్ల జరుగుతున్న నష్టాన్ని నివారించడానికి కర్ణాటక నుంచి కుంకీలను తీసుకువచ్చేందుకు శుక్రవారం (27న) రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోనుంది. కుంకీలు పూర్తి స్థాయిలో శిక్షణ పొందిన ఏనుగులు. ఇవి వస్తే అడవి కరిరాజులతో జట్టు కట్టి, వాటిని అనుకూలంగా మలుచుకొని తిప్పేలా చేస్తాయి. జనారణ్యంలో తిరుగుతున్న వాటిని తిరిగి అడవిలో తిరిగేలా దిశానిర్దేశం చేస్తాయి. ఇవి వస్తే జిల్లాలోని ఏనుగులు తమ ఇష్టానుసారంగా వ్యవహరించవని అటవీ యంత్రాంగం చెబుతోంది.


మన్యంలో తిరుగుతున్న ఏనుగులు

వనరులు లేవు

కుంకీలను తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ఒప్పందం మాత్రమే కుదుర్చుకుంటోంది. చిత్తూరు జిల్లాలో మాదిరిగా పార్వతీపురం మన్యం జిల్లాలో శిక్షణ పొందిన ఏనుగులను ఉంచేందుకు క్యాంపు లేదు. వాటి కోసం పనిచేసేందుకు సిబ్బంది లేరు. ఒకవేళ వాటిని అవసరం మేరకు ఇక్కడ వినియోగించేందుకు జూలో ఉంచే వీలుందని భావిస్తున్నాం. ఇక్కడైతే ఎటువంటి వసతులు, వనరులు ఇంకా ఏర్పాటు కాలేదు.
– జి.పి.ఎ.ప్రసూన, డీఎఫ్‌వో, పార్వతీపురం మన్యం జిల్లా

అనువైన పరిస్థితులు ఏవి

జిల్లాలో అవసరాల రీత్యా కుంకీలను తీసుకువచ్చేందుకు ఒప్పందాన్ని కుదుర్చుకుంటున్నప్పటికీ వీటిని ఉంచేందుకు అనువైన పరిస్థితులు లేవు. వీటి కోసం ప్రత్యేకంగా ఒక శిబిరం ఉండాలి. వాటిని నడిపించడానికి ప్రత్యేక యంత్రాంగం అవసరం. చిత్తూరులో అయితే అన్ని వసతులు, వనరులు ఉన్నాయి. జిల్లాలో ఏనుగులను సంరక్షించేందుకు ఎటువంటి వ్యవస్థ లేదు. కేవలం వాటి కదలికలను పరిశీలించడానికి ట్రాకర్లు మాత్రమే అందుబాటులో ఉన్నారు. వీరికి శిక్షణ ఇచ్చినా, ప్రత్యేకంగా రెస్క్యూ క్యాంపును నిర్వహించడానికి అనువైన పరిస్థితులు లేవు. సీతానగరం మండలం గుచ్చిమి దగ్గర ఏర్పాట్లు చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించినా ముందుకు వెళ్లడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో కుంకీలను తెచ్చినా.. వాటి నిర్వహణ ఎలా అని అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

పరిపూర్ణ మానవుడే శ్రీరాముడు

మాజీ ఉప రాష్ట్రపతి



పరిశోధన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకయ్యనాయుడు, చిత్రంలో రంగరాజన్ స్వామి, మాజీ ఎంపీ టీజీ.వెంకటేష్ తదితరులు

ఈనాడు, విజయనగరం: ధర్మాన్ని ఆశ్రయించి, స్వార్థాన్ని త్యజించి, ధార్మికుడిగా జీవితాన్ని గడిపిన పరిపూర్ణ మానవుడే శ్రీరాముడని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. రామనారాయణ ఆలయ ప్రాంగణంలో వాల్మీకి రామాయణ పరిశోధన కేంద్రాన్ని గురువారం ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. నేడు దేశంలోని ప్రతి గ్రామం శ్రీరాముని ఆలయం, భజన మందిరాలతో శోభిల్లుతోందన్నారు. రాముడు ఒక వ్యక్తిగా, రాజుగా, తనయుడిగా, అన్నగా, భర్తగా.. ఇలా ఎక్కడా ధర్మం తప్పకుండా మహనీయుడుగా ఎదిగారని కొనియాడారు. భారతదేశం హిందూ దేశమని, హిందూ అనేది జీవన విధానమన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ అనుసరిస్తే సుఖశాంతులు పొందే అవకాశం ఉందన్నారు.

ఆదర్శమార్గంలో పయనించాలి..

అంతా ఆదర్శ మార్గంలో పయనించే స్ఫూర్తి రావాలని ఆకాంక్షించారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కొంత మంది అనుసరిస్తున్న తప్పుడు విధానాలు సరికాదన్నారు. సర్వధర్మ సమభావన కోరుకునే సంస్కృతి మనదన్నారు. మారిన కాలంలో స్వార్థం పెరిగిందని అశాంతి ప్రబలుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నారాయణం ఆలయం నిర్మించిన నాటి నుంచి సుమారు కోటి మంది సందర్శించారని ట్రస్టీ నారాయణం నాగేశ్వరరావు తెలిపారు.

క్రమశిక్షణే ఉన్నతికి నిచ్చెన

ఈనాడు, విజయనగరం, న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం: ప్రతి ఒక్కరికీ క్రమశిక్షణ అవసరమని, అదే జీవితంలో ఉన్నతికి బాటలు వేస్తుందని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. గురువారం ఆయన కోరుకొండ సైనిక పాఠశాలను సందర్శించారు. కలెక్టర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందాల్, ప్రిన్సిపల్ ఎస్.ఎస్.శాస్త్రి స్వాగతం పలికారు. తర్వాత విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. మాతృభూమిని, మాతృభాషను గౌరవించాలని సూచించారు. కష్టమైనా ఇష్టపడి పనిచేయడం అలవర్చుకోవాలన్నారు. అనంతరం గ్రూప్ కెప్టెన్, ప్రిన్సిపల్ ఎస్.ఎన్.శాస్త్రితో కలిసి అన్ని విభాగాలను పరిశీలించారు. వైస్ ప్రిన్సిపల్, వింగ్ కమాండర్ వి.కిరణ్ పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి వేడుకలు

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవ జిల్లాస్థాయి వేడుకలు శుక్రవారం అట్టహాసంగా జరపనున్నట్లు పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆడలి వ్యూ పాయింట్ ప్రారంభం తర్వాత ఎన్టీఆర్ సాహస ఉద్యానవనంలో వేడుకలు జరుగుతాయని చెప్పారు. ఎన్టీఆర్ పార్కులో 5డీ థియేటర్, ఐ లవ్ సీతంపేట పేరుతో ఏర్పాటు చేసిన ఫొటో పాయింట్‌ను ప్రారంభిస్తామన్నారు. జబర్దస్త్ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా వివిధ స్టాల్స్, సవర ఆర్ట్స్ స్టాల్ ఏర్పాటు చేస్తామన్నారు.

ఆధునిక సాంకేతికతతో సత్ఫలితాలు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: ఆధునిక సాంకేతికతతో అన్ని రంగాల్లో మంచి ఫలితాలు సాధించవచ్చని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ అన్నారు. గురువారం జిల్లాలో తొలిసారిగా డ్రోన్ సహాయంతో పంటలకు మందు ద్రావణం పిచికారీ కార్యక్రమాన్ని కలెక్టరు బెలగాం ప్రాంతంలో ప్రారంభించారు. జిల్లాలో డ్రోన్లు వినియోగించి వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు పరిశీలించాలని ఆదేశించారు. వ్యవసాయంలో డ్రోన్ వినియోగం శుభపరిణామమని, ముమ్ముందు సేవలు విస్తృతం చేయాలన్నారు. జిల్లాలో కొంత మంది శిక్షణ పొందిన యువకులు ఉన్నారని జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్ తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయ అధికారి ఆర్.ధృవ, రైతు శిక్షణ కేంద్రం సహాయ సంచాలకుడు ఆర్.శ్రీనివాసరావు, పార్వతీపురం సహాయక సంచాలకుడు టి.వెంకటేష్, ఏవో ఎం.అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.


డ్రోన్ పిచికారీ ప్రారంభిస్తున్న కలెక్టరు శ్యామ్ ప్రసాద్, వ్యవసాయాధికారులు


అధికారులతో మాట్లాడుతున్న జిల్లా జడ్జి సాయి కళ్యాణ చక్రవర్తి

నైతిక విలువలతో మానసిక ప్రశాంతత

బెలగాం, న్యూస్‌టుడే: ఖైదీలు చక్కటి నడవడిక అలవర్చుకొని నిబంధనల ప్రకారం నడుచుకోవాలని విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్ బి.సాయి కళ్యాణ చక్రవర్తి సూచించారు. శుక్రవారం స్థానిక ఉపకారాగారాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీలతో మాట్లాడి అక్కడి పరిస్థితులు, పరిసరాల గురించి అడిగి తెలుసుకున్నారు. అందుతున్న వసతుల గురించి ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ నైతిక విలువలు పెంచుకోవాలని, దాని వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి విజయకళ్యాణి, రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.దామోదరరావు, జైలు సందర్శన న్యాయవాది టి.జోగారావు ఉన్నారు.

ఆగాయ్.. సిటీ స్కాన్ సేవలు

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

జిల్లా ఆసుపత్రిలోని సిటీ స్కాన్ సేవలు అయిదు రోజులుగా నిలిచిపోయాయి. యంత్రంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో పనిచేయడం లేదు. ప్రమాదాలకు గురైన వారికి తలలో గాయాలైనా, ఎముకలు, కణితులు, కండర లోపాలు, రక్తం గడ్డకట్టడం, ఊపిరితిత్తుల్లో సమస్య తదితరాల్లో లోపాలను తెలుసుకొని సరైన చికిత్స అందించేందుకు ఇదే ప్రధాన ఆధారం. శరీరంలో ఏ విధమైన లోపమున్నా సిటీ స్కాన్ ద్వారా తెలుసుకోవచ్చు. ఎక్స్‌రే కంటే ఎన్నో రెట్లు మంచి ఫలితాలు ఇస్తుంది. ఈ సేవలు నిలిచిపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లా ఆసుపత్రికి వచ్చే రోగుల్లో 98 శాతం మంది పేదలే. బయట స్కానింగ్ తీయించుకోవాలంటే రూ.3 వేలు ఉండాలి. ఆసుపత్రిలో రోజూ ఓపీకి 550 నుంచి 600 మంది వరకు వస్తుంటారు. వీరిలో రోజూ 10 నుంచి 15 మందికి ఈ స్కానింగ్ అవసరమవుతోంది. అత్యవసర కేసులను బయటకు పంపించాల్సి వస్తోంది. వీలును బట్టి కొన్ని కేసులను ఒకటి, రెండు రోజులు వాయిదా వేస్తున్నారు. సిటీ స్కాన్ సేవలపై ఆ విభాగం సిబ్బంది వద్ద ప్రస్తావించగా యంత్రానికి సంబంధించిన ఓ పరికరం పాడైందని, యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లి తెప్పించామన్నారు. నిపుణుడు వచ్చి దాన్ని అమర్చాల్సి ఉందన్నారు. జిల్లా ఆసుపత్రి ఆర్ఎంవో, ఇన్‌ఛార్జి సూపరింటెండెంటు శ్యామల వద్ద ప్రస్తావించగా సిటీ స్కాన్ సేవలు పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వచ్చిన పరికరాన్ని ఒకటి, రెండు రోజుల్లో అమరుస్తామని, రోగులకు ఇబ్బంది లేకుండా చూస్తామని చెప్పారు.



మూసేసిన గది

ఇంజినీరింగ్ శాఖలన్నీ ఖాళీ!


అన్నింటా ఇన్‌ఛార్జి పాలనే

న్యూస్‌టుడే, పార్వతీపురం

జిల్లాలో అభివృద్ధి పనులు ముందుకు సాగాలంటే క్షేత్రస్థాయిలో యంత్రాంగాన్ని పరుగులు పెట్టించేందుకు పర్యవేక్షక అధికారులు కావాలి. ప్రధానంగా ఇంజినీరింగు విభాగాల్లో డివిజన్ స్థాయి వారు కీలకం.

జిల్లాలో ప్రధాన ఇంజినీరింగు శాఖల్లో కీలక అధికారుల స్థానాలన్నీ ఖాళీ అయ్యాయి. వారి స్థానంలో ఎవరినీ నియమించకపోవడంతో అన్నింటా ఇన్‌ఛార్జుల పాలన కొనసాగుతోంది. ఈసారి బదిలీల్లో అయినా ఆ సీట్లు భర్తీ అవుతాయనుకుంటే నియామకాలు జరగలేదు. జిల్లా ఆవిర్భావం నుంచి ఇదే పరిస్థితి ఉంది.

★ గృహ నిర్మాణ సంస్థ జిల్లా ఇంజినీరింగ్ అధికారిగా వ్యవహరించాల్సిన పీడీని పూర్వ కలెక్టరు ఆ శాఖ ఉన్నతాధికారులకు అప్పగించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు.

★ పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి ఎంవీఆర్ కృష్ణాజీ ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో పాలకొండ కార్యనిర్వాహక ఇంజినీరు జి.రవికి బాధ్యతలు అప్పగించారు.

★ పార్వతీపురం ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ కార్యనిర్వాహక ఇంజినీరును ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆయన స్థానంలో శ్రీశైలం నుంచి ఓ అధికారిని ఇన్‌ఛార్జిగా నియమించారు. ఇంకా ఆయన బాధ్యతలు తీసుకోలేదు.

★ రహదారులు, భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజినీరు ఎం.జేమ్స్ విజయనగరం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. ఫలితంగా సాలూరు డీఈఈ సుబ్బారావు ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

★ జల వనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజినీరు ఆర్.అప్పలనాయుడిని శ్రీకాకుళం డివిజన్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎవరు రాలేదు. ప్రస్తుతం ఈఈ బాధ్యతలు ఎవరు నిర్వహిస్తారనే విషయంలో ఇంకా స్పష్టత లేదు.



ఫోకస్

ఆర్టీసీ సముదాయం.. అవస్థలమయం



బస్సులు ప్రవేశించే మార్గం వద్ద అధ్వానంగా పరిసరాలు



నాచుపట్టిన తాగునీటి ట్యాంకు

సాలూరు పట్టణంలోని ఆర్టీసీ సముదాయంలో నెలకొన్న దుస్థితి ఇది. ఇక్కడ ఏళ్ల నుంచి సమస్యలు రాజ్యమేలుతున్నాయి. దీంతో ప్రయాణికులకు నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. ఆవరణంలో పారిశుద్ధ్య లోపంతో పెద్దఎత్తు చెత్తకుప్పలు, వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. మరోవైపు బస్సులు వెళ్లే మార్గం మినహా మిగిలిన ప్రాంతమంతా రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. వాటిల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. సమీపంలోని తాగునీటి ట్యాంకు నాచు పట్టింది. దీని చుట్టూ బురదమయంగా మారడంతో కనీసం నీళ్లు పట్టుకునేందుకు వెళ్లలేని పరిస్థితి. దుర్వాసన కారణంగా అక్కడికి వెళ్లేందుకు ఎవరూ సాహసించడం లేదు. కాంప్లెక్స్ నిర్మాణం సైతం శిథిలస్థితికి చేరింది. దీనిపై డిపో ప్రబంధకుడు భాస్కర్‌రెడ్డిను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు ఇద్దరు పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారని, ఆవరణం శుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం






శిథిలస్థితికి చేరిన కాంప్లెక్స్ నిర్మాణం

ఆవరణలో ఏర్పడిన భారీ గుంతలో చేరిన నీరు

తెదేపా శాశ్వత సభ్యత్వానికి ఎంపీ కలిశెట్టి రూ.లక్ష విరాళం



విశాఖపట్నంలో మంత్రి లోకేశ్‌కు చెక్కు ఇస్తున్న ఎంపీ అప్పలనాయుడు, చిత్రంలో పల్లా శ్రీనివాసరావు

విశాఖపట్నం(వన్‌టౌన్), న్యూస్‌టుడే: తెదేపాలో శాశ్వత సభ్యత్వానికి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు రూ. లక్ష చెక్కును పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌కు గురువారం విశాఖలోని పార్టీ కార్యాలయంలో అందజేశారు. వచ్చేనెలలో సభ్యత్వాల నమోదు ఆరంభం కానున్న నేపథ్యంలో తొలి సభ్యత్వం ఇదేనని మంత్రి లోకేశ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ అప్పలనాయుడు మాట్లాడుతూ ఒక సామాన్య కార్యకర్తనైన తనకు ఎంపీగా అవకాశం కల్పించి పార్లమెంటుకు పంపించారని చెప్పారు.

కేజీబీవీల్లో మహిళలకు అవకాశం

ఉమ్మడి జిల్లాలో 82 పోస్టుల భర్తీకి చర్యలు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా సొసైటీ(పాఠశాల విద్యాశాఖ) ఆధ్వర్యంలో నడుస్తున్న కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో(కేజీబీవీలు) మహిళా బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలకు ప్రకటన వెలువడింది. ఏడు కేడర్లలో ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు. బోధన సిబ్బందిని ఒప్పంద ప్రాతిపదికన, బోధనేతరులను పొరుగుసేవల విధానంలో(ఒక సంవత్సర కాలానికి) తీసుకోనున్నారు. ఈమేరకు దరఖాస్తులు ఆహ్వానించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 82 పోస్టులకు అవకాశం ఉంది.

ప్రారంభమైన నమోదు..

ఇప్పటికే ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 26 నుంచి అక్టోబరు పదో తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఓపెన్ కేటగిరీకి సంబంధించి 18- 42 సంవత్సరాల మధ్య వయసు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ విభాగాల వారికి 5 సంవత్సరాలు, మాజీ సైనికులకు 3, దివ్యాంగులకు పది సంవత్సరాల మేర వయో పరిమితిలో మినహాయింపు కల్పించారు. ఇతర వివరాలను apkgvb.apcfss.in వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు డీఈవో ప్రేమకుమార్ గురువారం 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

భర్తీ చేయనున్న పోస్టులు ఇలా..

పేరు	విజయనగరం	మన్యం
ప్రధానాచారిణి	-	01
పీజీటీ	15	07
సీఆర్టీ	08	16
పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్	15	07
వార్డెన్	04	03
అకౌంటెంట్	06	-

దివ్యాంగులకు పింఛను పండగ

నేరుగా ఖాతాల్లోకే నగదు

– న్యూస్‌టుడే, విజయనగరం మయూరి కూడలి

పింఛన్లు పొందే దివ్యాంగుల కష్టాలు ఎట్టకేలకు తొలగనున్నాయి. ఇన్నాళ్లు నగదు పొందేందుకు ఇబ్బందులు పడేవారు.. దూర ప్రాంతాల్లో ఉండేవారు ప్రత్యేకంగా వాహనాలతో స్వగ్రామాలకు చేరేవారు. వీరిలో విద్యార్థులు సైతం ఉన్నారు. గత అయిదేళ్లలో ఈ కష్టాలు తీవ్రమయ్యాయి. సకాలంలో రాలేని వారికి అప్పట్లో తెదేపా మూడు నెలలకోసారి సైతం అందించేది. వైకాపా వచ్చాక ఆ విధానాన్ని తొలగించింది. ఈ పరిస్థితిని గమనించిన ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే నగదు వేయాలని నిర్ణయించింది. నవంబరు నుంచి అమల్లోకి తెస్తున్నట్లు పేర్కొంది.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 4.3 లక్షల మంది పింఛనుదారులున్నాయి. వీరిలో వివిధ విభాగాలకు సంబంధించి 49,622 మంది దివ్యాంగులు నగదు పొందుతున్నారు. వీరిలో చాలా మంది పనుల నిమిత్తం ఇతర గ్రామాల్లో ఉంటున్నారు. కొందరు దూర ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు. ఇంకొందరు విద్యార్థులు వసతి గృహాల్లో ఉండి చదువుకుంటున్నారు. ప్రతినెలా వీరు స్వగ్రామాలకు చేరుకుని పింఛను పొందుతున్నారు. ఇకనుంచి నేరుగా ఖాతాల్లోకి వేయనున్న నేపథ్యంలో ఇలాంటి వారు ఎంతమంది ఉన్నారో లెక్క తేల్చనున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఆ జాబితాను సిద్ధం చేస్తోంది.



దివ్యాంగుని చిత్రం తీస్తున్న మహిళ

మార్చుకునే సౌలభ్యం ఉంది..

ఏ విభాగం లబ్ధిదారులైన సొంత గ్రామంలోకి వెళ్లి పింఛను తీసుకోవాల్సిన అవసరం లేదని ఇప్పటికే ప్రభుత్వం స్పష్టం చేసింది. ఏ ప్రాంతంలో ఉంటే అక్కడి సచివాలయానికి మార్పు చేసుకునే అవకాశం కల్పించింది. అందుకు గానూ ప్రస్తుతం ఏ సచివాలయం పరిధిలో ఉన్నారో ఆ వివరాలతో కూడిన దరఖాస్తును అధికారులకు అందించాలి. నెలలో 5వ తేదీ నుంచి 16వ తేదీలో ఇవ్వాలి. ఏ సచివాలయానికి మార్చుకోవాలో ఆ చిరునామా పొందుపర్చాలి. అనంతరం సిబ్బంది పరిశీలించి, అక్కడికి బదిలీ చేస్తారు. ఈక్రమంలో ఆ తరువాత నెలలో ఉన్నచోటే నగదు పొందవచ్చు.

గుర్తింపు ప్రక్రియను ప్రారంభించాం..

ఇతర ప్రాంతాలు, వసతిగృహాల్లో ఉంటున్న దివ్యాంగ లబ్ధిదారుల వివరాలను సేకరిస్తున్నాం. ఈమేరకు సచివాలయాలకు ఆదేశాలు జారీ చేశాం. ప్రభుత్వం ఇచ్చిన వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేస్తాం. అనంతరం నేరుగా డీబీటీ ద్వారా ఖాతాల్లో నగదు జమకానుంది. సచివాలయ పరిధిని కూడా మార్చుకోవచ్చు. ప్రస్తుతం విజయనగరం జిల్లాలో ప్రతినెల 50 నుంచి 80 మంది వరకు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈ విధానం ఎంతో మేలు. – కల్యాణ్ చక్రవర్తి, డీఆర్డీఏ పీడీ

పథకాలను సద్వినియోగం చేసుకోండి



ధ్రువపత్రాలను అందజేస్తున్న కలెక్టరు

పార్వతీపురం, న్యూస్‌టుడే: హిజ్రాలు ఎదుర్కొంటున్న సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరిస్తామని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ అన్నారు. గురువారం దివ్యాంగులు, వయోవృద్ధులు, హిజ్రాల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పింఛన్లతో పాటు బస్సు, రైలు ప్రయాణాల్లో రాయితీలు, ప్రత్యేక వసతులు కల్పిస్తోందన్నారు. దివ్యాంగులకు సదరం పత్రాలు అందించేందుకు శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. అక్టోబరు 2న జరిగే స్వచ్ఛత కార్యక్రమాల్లో వయోవృద్ధులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లాలో 49 మంది హిజ్రాలకు గుర్తింపు కార్డులు అందజేశారు. సబ్‌కలెక్టరు అశుతోష్ శ్రీవాస్తవ్, ఏఎస్పీ అంకిత సురానా మహావీర్, దివ్యాంగుల సంక్షేమాధికారిణి కవిత, డీఆర్డీఏ పీడీ సత్యంనాయుడు, రెడ్‌క్రాస్ అధ్యక్షుడు మంచిపల్లి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు సరే.. ఉత్తర్వులేవీ?

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: రెవెన్యూ విభాగంలో పెద్ద సంఖ్యలో బదిలీలు జరిగాయి. కొన్ని రోజులుగా గోప్యత పాటించిన అధికారులు మంగళవారం రాత్రి వివిధ కేడర్లలో 462 మందికి స్థానచలనం కల్పించినట్లు అధికారికంగా వెల్లడించారు. గ్రేడ్-1 వీఆర్వోలకు సంబంధించి ప్రక్రియ పూర్తయినప్పటికీ ఇంకా ఉత్తర్వులు ఇంకా ఇవ్వలేదని తెలుస్తోంది. గురువారం వివిధ మండలాల నుంచి వారంతా కలెక్టరేట్‌కు వచ్చారు. ఉమ్మడి జిల్లాలో 238 మందిని ఇతర ప్రాంతాలకు పంపించాల్సి ఉంది. ఉత్తర్వులేకపోవడంతో పాత స్థానాల్లోనే కొనసాగుతున్నారు. ఎవరిని ఎక్కడికి పంపించారో తెలియడం లేదని, అధికారులను కోరేందుకు వచ్చినట్లు తెలిపారు. ఉత్తర్వులు సిద్ధం చేస్తున్నామని డీఆర్వో అనిత తెలిపారు.



డీఆర్వో కార్యాలయం వద్ద వీఆర్వోలు

నైపుణ్యాభివృద్ధి అధికారిగా ప్రశాంత్‌కుమార్



కలెక్టర్‌ను కలిసిన ప్రశాంతకుమార్

విజయనగరం ఉడాకాలనీ, మయూరి కూడలి న్యూస్‌టుడే: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారిగా జి.ప్రశాంత్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గురువారం కలెక్టర్ అంబేడ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేస్తూ ఇక్కడకు వచ్చారు. ఇంతవరకు ఈ స్థానంలో ఉన్న గోవిందరావు అనకాపల్లి జిల్లాకు బదిలీపై వెళ్లారు.

రెవెన్యూలో మార్పులు

డెంకాడ, బొబ్బిలి, న్యూస్‌టుడే: జిల్లాలోని పలువురు ఆర్డీవోలను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. విజయనగరం ఆర్డీవోగా వీఎంఆర్డీ కార్యదర్శి దాట్ల కీర్తిని నియమించారు. సూర్యకళను జేఏడీలో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. డెంకాడ తహసీల్దారు కార్యాలయంలో పనిచేస్తున్న పలువురు రెవెన్యూ అధికారులకు స్థానచలనమైనట్లు తహసీల్దారు పద్మావతి తెలిపారు. ఇక్కడ డీటీగా పనిచేసిన సూర్యకాంతాన్ని చీపురుపల్లి డీటీగా, ఆర్ఐ అనూషను కలెక్టరేట్‌లోని ఎ-2 సెక్షన్‌లో, జూనియర్ సహాయకుడిగా పనిచేస్తున్న సురేష్‌ను భోగాపురం తహసీల్దారు కార్యాలయంలో నియమించామన్నారు. ఆర్డీవో కార్యాలయంలో పనిచేసిన గాంధీ డెంకాడ డీటీగా, కలెక్టరేట్‌లో పరిపాలనా విభాగంలో ఉన్న కిరణ్ ఆర్ఐగా, భోగాపురం నుంచి ప్రసాద్ రీసర్వే డీటీగా, గుర్లలో పనిచేసిన డీటీ శంకర్ డెంకాడ, నెల్లిమర్ల సీఎస్‌డీటీగా వెళ్లనున్నారు.

టిడ్కో ఈఈగా రమణమూర్తి..

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాల టిడ్కో ఈఈగా పనిచేస్తున్న పి.జ్యోతిని డివిజన్ విజయనగరం ప్రజారోగ్య విభాగం ఈఈగా రానున్నారు. ఇక్కడ ఈఈగా ఉన్న కె.దక్షిణామూర్తి శ్రీకాకుళం నగరపాలక సంస్థకు ఈఈగా వెళ్లనున్నారు. ★ జీవీఎంసీలో ఈఈగా పనిచేస్తున్న డీవీ.రమణమూర్తిని ఏపీ టిడ్కో విజయనగరం ఈఈగా నియమించారు ★ విజయనగరం నగరపాలక సంస్థలో సర్వేయరుగా విధులు నిర్వహిస్తున్న రెడ్డి సింహాచలాన్ని గంట్యాడ బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న అప్పలస్వామిని కలెక్టరేట్‌కు పంపించారు.

ఉత్తరావిల్లి రోడ్డు.. ఊడిపోయింది



ఉత్తరావిల్లి సమీపంలో భారీ గుంతలతో రహదారి

తెర్లాం మండలంలోని ఉత్తరావిల్లి ఆర్‌అండ్‌బీ రహదారిపై వర్షానికి గోతులు మరింత పెద్దవయ్యాయి. ఇటీవల లారీలు కూరుకుపోవడంతో బుదరాయవలస పోలీసులు కొన్ని చోట్ల మట్టితో పూడ్చారు. మళ్లీ పరిస్థితి యథాస్థితికి వచ్చింది. పారాది వంతెన పైనుంచి నీరు ప్రవహిస్తుండడంతో భారీ వాహనాలన్నీ ఉత్తరావిల్లి, తెర్లాం మీదుగా బొబ్బిలి వైపు వెళ్తున్నాయి. దీంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చోదకులు వాపోతున్నారు. రహదారి అభివృద్ధికి నిధులు కోరుతూ ప్రతిపాదనలు పంపించామని, మంజూరైన వెంటనే బాగు చేయిస్తామని ఆర్‌అండ్‌బీ ఏఈ రాజు తెలిపారు. – న్యూస్‌టుడే, తెర్లాం



దారిపొడవునా ఇదే పరిస్థితి

వసతిగృహాలకు రూ.9 కోట్ల నిధులు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: ఎస్.కోట పట్టణంలోని అద్దె భవనంలో కొనసాగుతున్న ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహ భవన నిర్మాణానికి ప్రధాన మంత్రి అజయ్ పథకం కింద రూ.3 కోట్లు మంజూరైనట్లు సాంఘిక సంక్షేమశాఖ డీడీ రామానందం తెలిపారు. ఆయన గురువారం 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. జిల్లాలోని ఎస్.కోటతో పాటు విజయనగరం, గజపతినగరంలోని వసతిగృహాలకు రూ.3 కోట్ల చొప్పున నిధులొచ్చాయన్నారు. ఎస్.కోటలో గతంలో ఉన్న ప్రీమెట్రిక్ బాలికల వసతిగృహం స్థలంలో కొత్తగా కళాశాల వసతి భవనాన్ని నిర్మిస్తామన్నారు. మరో ఆరు చోట్ల(తెర్లాం, బాడంగి, విజయనగరం, ఎస్.కోట, గజపతినగరం, బొబ్బిలి) సాంఘిక సంక్షేమ గృహాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. వాటితో పాటు ఎస్.కోటలో ఎస్టీ ఆశ్రమోన్నత పాఠశాల భవనం మరమ్మతులకు రూ.25 లక్షలతో ప్రతిపాదించామన్నారు. నిధులొస్తే పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	118	206	216

ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణం



వెంకటరమణ (పాతచిత్రం)

రేగిడి, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రేగిడి మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు బాలకవిలస గ్రామానికి చెందిన కె.వెంకటరమణ(38) వాహన చోదకుడిగా పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. ఈక్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై గురువారం గ్రామ శివారున పురుగు మందు తాగడంతో అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించడంతో వారు హుటాహుటిన చేరుకుని రాజాంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళంలోని ఓ ఆసుపత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు తెలిపారు. ఆయనకు భార్యతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. శవపంచనామా అనంతరం మృతదేహాన్ని అప్పగించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై గౌరునాయుడు తెలిపారు.

లారీ ఢీకొని వృద్ధుడి మృత్యువాత

తెర్లాం, న్యూస్‌టుడే: లారీ ఢీకొని ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన తెర్లాం మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై సాగర్‌బాబు వివరాల మేరకు.. తెర్లాం గ్రామానికి చెందిన వి.భీమయ్య(68) బుధవారం కాలనీ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు రాజాంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు గురువారం ఎస్సై తెలిపారు.

చెరువులో పడి మహిళ మృతి

పార్వతీపురం గ్రామీణం/పురపాలిక, న్యూస్‌టుడే: భర్త చనిపోయాడు.. పిల్లలు లేరు.. బంధువులంతా దూరమయ్యారు.. ఈక్రమంలో బతుకు భారంగా మారడంతో తెలిసిన వారి ఇళ్లల్లో పని చేసుకుంటూ జీవనం సాగించేవారు. గురువారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి ప్రాణాలు కోల్పోయారు ఓ మహిళ. ఈ విషాదకర ఘటన పార్వతీపురం మండలంలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు కృష్ణపల్లి పంచాయతీ ధనుంజయపురం రెవెన్యూ పరిధిలోని వివేకానంద కాలనీకి చెందిన ఎం.అన్నపూర్ణ(40) భర్త బాలకృష్ణ రెండేళ్ల క్రితం మృతిచెందారు. ఒంటరిగా కొన్నాళ్లు ఆశాజ్యోతి అనాథ ఆశ్రమంలో పనులు చేసుకుంటూ జీవనం సాగించారు. కొన్నిరోజుల నుంచి తనకు తెలిసిన ఎల్ఐసీ ఉద్యోగి కుటుంబానికి సాయమందిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు పట్టణంలోని పాత్రుని చెరువుకు వెళ్లారు. గట్టు పైనుంచి నీరు తీసుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తూ పడి మృతిచెందారు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ జయరావు తెలిపారు.

వరద బాధితులకు రూ.1.20 లక్షల సాయం

పార్వతీపురం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం పార్వతీపురంలోని శ్రీజన్ గ్లోబల్ పాఠశాల విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి రూ.లక్ష సమీకరించారు. గురువారం కలెక్టరు శ్యామ్‌ప్రసాద్‌కు చెక్కు రూపంలో అందజేశారు. బలిజిపేట మండలం పెదపెంకి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూ.20 వేల చెక్కును ముఖ్యమంత్రి సహాయనిధికి కలెక్టరు ద్వారా అందజేశారు.

కర్రోతుకు సత్కారం



భోగాపురం, న్యూస్‌టుడే: ఇటీవల మార్క్‌ఫెడ్ ఛైర్మన్‌గా నియమితులైన కర్రోతు బంగార్రాజుకు అమరావతిలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో గౌరవ సత్కారం లభించింది. పదవి స్వీకరించిన తర్వాత తొలిసారిగా గురువారం వ్యవసాయశాఖ కమిషనర్ ఎస్.ఢిల్లీరావును కలిసి కాసేపు మాట్లాడారు. అనంతరం మార్క్‌ఫెడ్ జీఎం శ్రీనివాసరావుతో కలిసి కమిషనర్ ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. రైతులకు అండగా ఉంటూ, వారికి అవసరమైన విత్తనోత్పత్తులను అందజేస్తూ గిట్టుబాటు ధర కల్పించాలన్నదే తన ధ్యేయమని ఈ సందర్భంగా బంగార్రాజు పేర్కొన్నారు.

నూతన ఒరవడి.. అధిక దిగుబడి



మారుతున్న కాలానుగుణంగా పంటల సాగులో కర్షకులు కొత్త పుంతలు తొక్కుతున్నారు. నూతన ఒరవడికి శ్రీకారం చుట్టి అధిక దిగుబడులు సాధిస్తున్నారు. జియ్యమ్మవలస మండలం పెదకుదమ, చింతలబెలగాం గ్రామాల మధ్యలోని పొలాల్లో మిరప, టమాటా సాగులో మల్చింగ్ పేపర్ పరిచి మొక్కలు నాటేందుకు సిద్ధం చేస్తున్నారు. ఈ విధానంతో కలుపు నివారణతో పాటు నీటి ఆదా, చీడపీడల బెడద తక్కువగా ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. – న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం

సీసీ కెమెరాల నిఘా తప్పనిసరి: ఎస్పీ

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: జిల్లాల నేరాల నియంత్రణ, నిందితులను గుర్తించేందుకు సీసీ కెమెరాల నిఘా తప్పనిసరి అని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో ఉన్న కమాండ్ కంట్రోల్ రూంను పరిశీలించారు. కెమెరాల పరితీరుపై ఆరా తీశారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న కెమెరాలు, వాటి వినియోగం తదితర వివరాలను తెలుసుకున్నారు. ఈ విభాగాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎస్బీ సీఐ ఏవీ.లీలారావు తదితరులు పాల్గొన్నారు.

నేరవార్తావిభాగం: గుండె పరిరక్షణ దినోత్సవం సందర్భంగా తిరుమల మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందికి గురువారం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. హృద్రోగ సమస్యలతో ఇబ్బంది పడేవారికి సీపీఆర్‌తో పునర్జన్మ ఇవ్వొచ్చని ఈ సందర్భంగా ఎస్పీ అన్నారు.



కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న వకుల్ జిందాల్

సమస్యల పరిష్కారానికి కృషి


వినతులు స్వీకరిస్తున్న డీఎంహెచ్‌వో

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని డీఎంహెచ్‌వో విజయపార్వతి అన్నారు. గురువారం వైద్య ఆరోగ్య శాఖ కమిషనరు ఆదేశాల మేరకు కార్యాలయం వద్ద ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కార వేదికలో పలువురు వినతిపత్రాలు అందజేశారు. వాటిని పరిశీలించిన డీఎంహెచ్‌వో దశల వారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో జగన్మోహనరావు, డీపీహెచ్ఎన్‌వో ఉషారాణి, డీసీఎం విజయలత, డెమో యోగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

గోదాముల ఆకస్మిక తనిఖీ


బస్తాల బరువు పరిశీలిస్తున్న అధికారులు

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేటలోని పౌర సరఫరాలశాఖ గోదాము నుంచి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బి.సింహాచలం, తూనికలు కొలతల శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.ఉంగారెడ్డి, ఫుడ్ సేఫ్టీ అధికారి వై.రామయ్యలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. గోదాములోని బియ్యం బరువు, వే బ్రిడ్జి పరిశీలించారు. వివిధ సరకుల నమూనాలు(శాంపిల్స్) సేకరించి ప్రయోగశాలకు పంపించారు. దస్త్రాలు, కంప్యూటర్‌లోని వివరాలకు గోదాంలోని సరకులకు మధ్య పొంతన చూశారు. సీఎస్ డీటీ సీహెచ్.రమేష్ బాబు ఉన్నారు.

వసతి గృహాల్లో ప్రత్యేక జ్వరగదులు


బాలుడిని పరామర్శిస్తున్న ఏడీఎంవో

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని వసతి గృహాల్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జ్వరగది (సిక్‌రూం) తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ ఆదేశించారు. గురువారం డోకిశిల గిరిజన బాలుర ఉన్నత పాఠశాల వసతిగృహాన్ని పరిశీలించారు. జ్వరంతో బాధపడిన కార్తీక్‌ను కలిసి పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. తర్వాత సిక్‌రూం ఏర్పాటు చేసిన గది కిటికీలకు మెష్‌లు బిగించి, పరిశుభ్రత పాటించాలని సూచించారు. పిల్లల ఆరోగ్యంపై అనుమానం వస్తే పీహెచ్‌సీ వైద్యులకు చూపించాలని ఆదేశించారు.

ఉద్యోగోన్నతితో మెరుగైన సేవలు


అభినందిస్తున్న ఎస్పీ మాధవ రెడ్డి

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: ఉద్యోగోన్నతి పొందిన ప్రతి ఒక్కరూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఏఎస్‌ఐలుగా పనిచేస్తున్న షేక్ మస్తాన్ (నరసన్నపేట), మజీబులు ఎస్‌ఐలుగా, బాడంగి స్టేషన్‌లో హెచ్‌సీగా పనిచేసిన డి.సన్యాసిరావు ఏఎస్‌ఐగా, కుమారస్వామికి ఏఆర్ ఎస్‌ఐగా పదోన్నతి లభించింది. వారిని జిల్లాలో నియమించడంతో వారంతా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. పదోన్నతి పొందిన వారిని ఎస్పీ అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

? మక్కువలోని నంద గ్రామంలో కుళాయి పైపులకు ట్యాపులు లేక నీరు వృథాగా పోతుంది. - స్థానికులు, నంద

● సిబ్బందితో సమస్యను పరిష్కరిస్తాం. - బి.రమేష్, సర్పంచి. మక్కువ, న్యూస్‌టుడే

? కంబరవలస శ్మశానవాటిక రహదారిపై తుప్పలు పేరుకుపోయాయి. - వంశధరరావు

● క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - జి.సత్యనారాయణ, ఏపీవో - న్యూస్‌టుడే, వీరఘట్టం

? అప్పయ్యపేట ప్రధాన రహదారికి సమీపంలో రెండు చోట్ల విద్యుత్తు స్తంభం కోసం గోతులు తవ్వి వదిలేయడంతో ప్రమాదకరంగా మారాయి. - రామకృష్ణ, అప్పయ్యపేట

● గుత్తేదారుతో గోతులు పూడ్చే పనులు చేపడతాం. - జగన్మోహనరావు, ఏఈ - న్యూస్‌టుడే, సీతానగరం

? బలిజిపేటలోని వంతరాం నుంచి గళావల్లికి వెళ్లే మార్గంలో ప్రమాదకరమైన మలుపు ఉంది. - పడాల ఈశ్వరరావు

● ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, చర్యలు తీసుకుంటాం. - జయరాజ్, ర-భ శాఖ జేఈ - న్యూస్‌టుడే, బలిజిపేట

అమ్మ దర్శనం.. మార్గం సుగమం

● సీసీ కెమెరాల నిఘాలో ఉత్సవ పర్యవేక్షణ ● వెల్లడించిన డీఎస్పీ


మాట్లాడుతున్న డీఎస్పీ రాంబాబు

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం కోటదుర్గమ్మ దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ ఎం.రాంబాబు తెలిపారు. గురువారం సాయంత్రం సీఐ ఎం.చంద్రమౌళి, ఎస్సై ప్రయోగమూర్తితో విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఉత్సవాలను నిరంతరం సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తామన్నారు. దీని కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించామన్నారు. పొరాది వంతెనపై నుంచి రాకపోకలు పాలకొండ మీదుగా మళ్లించడంతో ఆంక్షలు విధిస్తున్నట్లు వివరించారు. ఉత్సవాలకు సంబంధించి 210 మందితో బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు.

సజావుగా రాకపోకలు

ఉత్సవాలు జరగనున్న రోజుల్లో పాలకొండ పట్టణంలో ట్రాఫిక్ చర్యలు చేపడుతున్నారు. రాజాం వైపు నుంచి వస్తున్న వాహనాలు అన్నవరం కూడలి మీదుగా మళ్లిస్తారు. వీరఘట్టం వైపు నుంచి వచ్చే వాహనాలు అన్నవరం, వడమ గ్రామాల మీదుగా తరలిస్తామన్నారు. ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి రాజాం, వీరఘట్టం, శ్రీకాకుళం వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు ప్రధాన రహదారి మీదుగా వెళ్లనున్నాయి.

11 రోజులపాటు ఆంక్షలు

కోటదుర్గమ్మ ఉత్సవాలు అక్టోబరు 3 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో రెండో తేదీ నుంచి 13 వరకు వాహనాలు మళ్లించనున్నారు. ప్రధాన రహదారిలో ఉన్న అల్పాహార, తోపుడుబళ్ల సిబ్బంది ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. రాయగడ, శ్రీకాకుళం, విజయనగరం వైపు వెళ్లే భారీ వాహనాలు కార్గిల్ కూడలి మీదుగా రాజాం-చిలకపాలెం మీదుగా వెళ్తాయి. శ్రీకాకుళం, రాయగడ వెళ్లే వాహనాలు చిలకపాలెం, రాజాం, రామభద్రపురం మీదుగా వెళ్తాయి. శ్రీకాకుళం, కొత్తూరు, సీతంపేట వెళ్లే వాహనాలు పాతపట్నం, కొత్తూరు మీదుగా వెళ్తాయి. రాయగడ, కొత్తూరు వెళ్లే వాహనాలు కురుపాం, ఎల్విన్‌పేట, బత్తిలి మీదుగా వెళ్తాయి. విజయనగరం నుంచి బత్తిలి, కొత్తూరు వైపు వెళ్లాల్సిన వాహనాలు పార్వతీపురం, కురుపాం, ఎల్విన్‌పేట మీదుగా మళ్లిస్తున్నామన్నారు.

పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు

రాజాం వైపు నుంచి కోటదుర్గమ్మ ఆలయానికి వచ్చే భక్తుల వాహనాలను పాత ఆర్‌అండ్‌బీ కార్యాలయం వద్ద పార్కింగ్ కేటాయించారు. శ్రీకాకుళం, సీతంపేట, కొత్తూరు వైపు నుంచి వచ్చే వాహనదారులు ఆర్డీవో కార్యాలయం పక్కన ఖాళీ స్థలంలో వాహనాలు నిలపాలి. వీరఘట్టం వైపు నుంచి వాహనదారులు కార్గిల్ కూడలిలో వాహనాలు నిలిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.


పాలకొండలో భారీ వాహనాలు

మట్టిపరీక్షతో మంచి ఫలితాలు


మట్టి సేకరిస్తున్న విద్యార్థులు

పాచిపెంట, న్యూస్‌టుడే: మట్టి నమూనాలు సేకరణ, పరీక్షతో మంచి ఫలితాలు సాధించొచ్చునని ఏవో తిరుపతిరావు తెలిపారు. కేంద్రం ఆదేశాలతో సరాయివలస ఏకలవ్య పాఠశాల విద్యార్థులకు పంటలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ దేవేంద్ర సింగ్ మాట్లాడుతూ పంటలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని, సేంద్రియ ఎరువుల వాడకంతో ఆరోగ్యకరమైన పంటలు పండించుకోవచ్చునన్నారు. ఇళ్ల వద్ద ఖాళీ స్థలాల్లో ఇంటి అవసరాలకు తగ్గట్టుగా కూరగాయలు, ఆకుకూరలు పండించే విధంగాతల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు.

తూటికాడ కషాయంతో సుడిదోమ నివారణ


కషాయం తయారీలో మహిళా రైతులు

పార్వతీపురం గ్రామీణం: ఖరీఫ్ సీజన్ వరిసాగులో సుడిదోమ నివారణకు తూటికాడ కషాయం దివ్య ఔషధమని ఎన్ఎఫ్ఏ తిరుపతిరావు అన్నారు. గురువారం పుట్టూరులో సేంద్రియ మహిళా రైతులకు క్షేత్రస్థాయిలో కషాయం తయారీ విధానంపై అవగాహన కల్పించారు. ఖర్చు లేకుండా చెరువులో లభించే తూటికాడ అకులను మరిగించిన నీటిలో వేసి కషాయం తయారీని చూపారు. ఎకరాకు 10 లీటర్ల కషాయం వంద లీటర్ల నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు.

తాగునీరు వృథా



పార్వతీపురం మండలంలోని సూడిగాం పంచాయతీ మూడడ్లవలసలో కుళాయి ట్యాపులు పాడై రక్షిత తాగునీరు వృథాగా పోతోంది. స్థానికులు కొన్నిచోట్ల అడ్డుపెట్టినా తాగునీరు పిచికారీలా పోతోంది. గ్రామంలో ఆరు చోట్ల ఇలా నీరు వృథాగా పోతోందని స్థానికులు తెలిపారు. పంచాయతీకి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని మహిళలు వాపోతున్నారు. విషయం ఈవోపీఆర్డీ జీవీఆర్ మూర్తి వద్ద ప్రస్తావించగా పరిస్థితి పరిశీలించి, చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

రేకుల శాలలోనే తరగతులు

సీతంపేట మండలం రామానగరం ఎంపీపీ పాఠశాలకు పక్కా భవనం లేకుండాపోయింది. 1996లో నిర్మించిన రేకుల షెడ్డులోనే విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఇది మరమ్మతులకు గురవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు కారుతోంది. గోడలు నానిపోవడంతో మట్టి కరిగి ప్రమాదం మారింది. ఇక్కడ ఆరు గ్రామాలకు చెందిన 40 మంది విద్యార్థులు చదువుతున్నారు. నాడు-నేడు రెండు విడతలు జరిగినా పట్టించుకోలేదన్నారు. దీనిపై ఎంఈవో ఎం.ఆనందరావు మాట్లాడుతూ. .కొత్త భవన కోసం ప్రతిపాదిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, సీతంపేట



బురదలోనే రాకపోకలు



బలిజిపేట మండలం గంగాడ ప్రధానవీధి బురదతో నిండిపోయింది. 15 ఏళ్ల క్రితం పీఎంజీఎస్‌వై నిధులతో తారు రోడ్డు నిర్మించారు. నాటి మరమ్మతులకు నోచుకోకపోవడంతో రహదారి గోతుల మయంగా మారింది. మరోవైపు కాలువలు ఎత్తులో నిర్మించడంతో ఏడాది పొడవునా గృహాల వాడుక, వర్షపునీరు గోతుల్లో నిండిన నిలిచిపోతోంది. దీనిపై ర.భ. శాఖ జేఈ జయరాజును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పరిశీలించి తదుపరి చర్యలు చేపడతామన్నారు.

– న్యూస్‌టుడే, బలిజిపేట

ప్రమాదం అంచున ప్రయాణం

మక్కువ మండలం నందబొడ్డవలస రహదారి ప్రమాదకరంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా బెర్మ్‌లు లేకపోవడంతో వర్షాలకు కోతకు గురయ్యింది. దీంతో గత అయిదేళ్లుగా వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. మక్కువ, సాలూరు మండలంలోని పలు గ్రామాలు, ఒడిశా కొటియా గ్రామాలకు ఇదే ప్రధాన మార్గం. పలు సందర్భాల్లో ప్రమాదాలకు గురయ్యామని, అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. నంద సర్పంచి మాట్లాడుతూ.. అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, మక్కువ



వాట్సాప్ గ్రూపు పేరిట సైబర్ మోసం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: వాట్సాప్ గ్రూపు పెట్టి సభ్యులతో పెట్టుబడులు పెట్టించి అధిక లాభాలు వస్తాయని చెప్పి సైబర్ మోసానికి పాల్పడిన సంఘటనపై అనకాపల్లి పట్టణ పోలీసులు గురువారం కేసు నమోదుచేశారు. పట్టణ సీఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండకు చెందిన గన్నిపూడి వేణుగోపాలకృష్ణ గతంలో అనకాపల్లిలోని ఓ బ్యాంకులో పనిచేసేవారు. ఇతని ఫోన్ నంబరును ఈ ఏడాది ఫిబ్రవరి 27న అపరిచిత వ్యక్తి వాట్సాప్ గ్రూపులో చేర్చాడు. గ్రూపులో 150 మందికి పైగా పెట్టుబడులు పెట్టి లాభాలు పొందారని నమ్మించాడు. నమ్మిన వేణుగోపాలకృష్ణ దఫదఫాలుగా రూ.15 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. అలా చేస్తున్న సమయంలో గ్రూపులోని సభ్యులు ఒక్కొక్కరు తప్పుకోవడంతో అనుమానం వచ్చి సైబర్ క్రైంకు ఫిర్యాదు చేశాడు. వేణుగోపాలకృష్ణ పంపిన నగదులో రూ.5.35 లక్షలు సైబర్ క్రైం పోలీసులు సీజ్ చేశారు. దీనిపై బాధితుడు అనకాపల్లి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ తెలిపారు.

వైభవంగా క్షీరాభిషేకాలు

వీరఘట్టం: మండలంలోని వండువ షిర్డీ సాయి ధ్యానమందిరంలో గురువారం క్షీరాభిషేకాలు, సాయి సహస్రనామార్చనలు జరిపారు. ధర్మకర్త మజ్జి సింహాచలం ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

చలో కలెక్టరేట్ గోడప్రతుల ఆవిష్కరణ

కలెక్టరేట్ ప్రాంగణం: కలెక్టరేట్ వద్ద తాగునీటి సమస్యపై రిలే దీక్ష శిబిరాన్ని ఆర్టీసీ యూనియన్ రాష్ట్ర నాయకుడు తులసీరామ్ గురువారం సందర్శించారు. 1న చలో కలెక్టరేట్ గోడప్రతులను ఆవిష్కరించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, జి.వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రభుత్వ సాయం

పార్వతీపురం పురపాలక: పురపాలక సంఘం ఇంజినీరింగ్ విభాగంలో పొరుగు సేవల కార్మికుడు వై.జగన్నాథం అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన భార్య భారతికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.15 వేలను కమిషనరు కె.శ్రీనివాస్ గురువారం అందజేశారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

సీతానగరం: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ రాజేష్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. గురువారం మండలంలోని ఆర్.వెంకంపేట విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

మక్కువ: మండలంలోని వెంకటభైరిపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి 16 మందికి అద్దాలు అవసరమని వైద్యుడు ప్రసాద్ తెలిపారు. హెచ్ఎం ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మర్యాదపూర్వక కలయిక

కురుపాం గ్రామీణం: ట్రైకార్ సభ్యురాలిగా ఎన్నికైన పువ్వల లావణ్య గురువారం మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజును విశాఖపట్నంలో కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఆయన యోగక్షేమాలు తెలుసుకున్నారు.

తప్పుగా మాట్లాడితే ఊరుకోం

మక్కువ: జనసేన అధినేత పవన్ కల్యాణ్ గురించి తప్పుగా మాట్లాడితే పార్టీ శ్రేణులు ఊరుకోరని సాలూరు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త గేదెల రిషివర్ధన్ అన్నారు. వైకాపా నేత పేర్నినాని వ్యాఖ్యలను ఖండించారు.

ఒకరికి గాయాలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని బుడ్డెమ్మఖర్జ సమీపంలో ద్విచక్ర వాహనంపై అతివేగంగా వెళుతున్న ఓ వ్యక్తి రహదారిపై బోల్తా పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు బాధితుడికి సపర్యలు చేసి ఆసుపత్రికి తరలించారు.

ఆర్డీవో బదిలీ

బొబ్బిలి: జిల్లాలోని పలువురు ఆర్డీవోలను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పాలకొండ ఆర్డీవో వి.వెంకటరమణకు నర్సీపట్నానికి బదిలీ అయ్యింది.

ఇది మంచి ప్రభుత్వం

కురుపాం గ్రామీణం: మండలంలోని తిత్తిరిలో గురువారం జనసేన నాయకులు 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త కద్రక మల్లేశ్, నాయకులు వంశీ, శివకుమార్, నీలకంఠేశ్వరరావు, ప్రసాద్, సురేష్ పాల్గొన్నారు.

చింతపిక్కలతో వినూత్న బోధన



గుమ్మలక్ష్మీపురం మండలం చెముడుగూడ ద్రవ్యసహాయక పాఠశాలలో విద్యార్థులకు వినూత్న బోధన చేపడుతున్నారు. ప్రధానంగా చింతపిక్కలతో చిన్నారులకు అక్షరాలు, బొమ్మలు, పదాలను సాధన చేయిస్తున్నారు. విద్యార్థులు ఆసక్తిగా అక్షరాలపై పట్టు సాధించడంతోపాటు క్రమం తప్పకుండా పాఠశాలకు వస్తున్నారని ఉపాధ్యాయులు కొండలరావు, సూర్యారావు చెబుతున్నారు.

– న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం

గుంతలు పూడ్పించిన ఎస్ఐ


గుంతలో మట్టి కప్పుతున్న చోదకులు

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: తోటపల్లి ప్రధాన కాలువ సమీపంలో శ్రీకాకుళం రహదారిపై ఉల్లిభద్ర వద్ద ఇటీవల కురిసిన వర్షాలకు పెద్ద గోతులు ఏర్పడి వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య పెరిగింది. గరుగుబిల్లి ఎస్ఐ రమేష్‌నాయుడు లారీతో మట్టిని తెప్పించి గోతులు పూడ్పించారు. ఈ నెలలో గోతులు కప్పించడం మూడోసారి. తాను కూడా రాళ్లు అందించడం విశేషం. ఉల్లిభద్ర గ్రామస్థులు, కానిస్టేబుళ్లు శంకరనాయుడు, సుధాకర్, నీలకంఠం సహకరించారు.

కోటదుర్గమ్మ హుండీ ఆదాయం రూ.1.85 లక్షలు

పాలకొండ, న్యూస్‌టుడే: పాలకొండ కోటదుర్గమ్మ ఆలయంలో గురువారం హుండీ ఆదాయం లెక్కించారు. 22 రోజులకు మొత్తం రూ.1,85,222 సమకూరినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి సూర్యనారాయణ తెలిపారు. లెక్కింపును దేవాదాయశాఖ జిల్లా కార్యాలయ సీనియర్ సహాయకుడు ఎస్.రామారావు పర్యవేక్షించారు.

నేడు రాజాంలో ముఖాముఖి

సీతంపేట, న్యూస్‌టుడే: రాజాంలోని నైరెడ్‌లో శుక్రవారం స్త్రీ, పురుషులకు వివిధ శిక్షణలు ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఎం.రాజేష్ తెలిపారు. పురుషులకు ఎలక్ట్రికల్, కంప్యూటర్, స్త్రీలకు టైలరింగ్, హోమ్ నర్సింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్ వంటి శిక్షణలు ఇస్తామన్నారు. ఉచిత శిక్షణ, వసతి, భోజన సదుపాయం అందిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు ధ్రువపత్రాలతో ముఖాముఖికి హాజరవ్వాలన్నారు.

లక్ష్మీనృసింహునికి ముడుపుల పూజలు

సీతానగరం, న్యూస్‌టుడే: సీతానగరం వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీనృసింహునికి గురువారం ముడుపుల పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో మూలవిరాట్‌ను పూల, తులసి మాలలతో అలంకరించారు. పార్వతీపురం, బొబ్బిలి, పాలకొండ ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తుకు అంతరాయం

సాలూరు గ్రామీణం, మక్కువ, పార్వతీపురం పురపాలిక, న్యూస్‌టుడే: సాలూరు పట్టణం పరిధిలోని రామాకాలనీ, అఫీషియల్ కాలనీ, తహసీల్దార్ కార్యాలయం ప్రాంతాల్లో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ డీఈఈ గోపాలరావు తెలిపారు.

● మక్కువ మండల పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ కె.గోపాలరావునాయుడు తెలిపారు.

● పార్వతీపురం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ రమణారావు తెలిపారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

సీతానగరం, గుమ్మలక్ష్మీపురం: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని ఎమ్మెల్యే విజయచంద్ర అన్నారు. గురువారం ఆర్.వెంకంపేటలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు నిర్వహించిన సామూహిక సీమంతంలో పాల్గొన్నారు. ● కాశాపేటకు చెందిన తెదేపా నాయకులు విజయవాడ వరద బాధితులకు రూ.25 వేల ఆర్థికసాయం అందించారు. ● అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జగదీశ్వరి అన్నారు. మండలంలోని చెముడుగూడలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అర్హులందరికీ పింఛన్ల పంపిణీ ప్రక్రియకు శ్రీకారం చుట్టామన్నారు. సామాన్య వ్యక్తిగా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తామన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతో సాధ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

పాలకొండ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని ఎమ్మెల్యే జయకృష్ణ పేర్కొన్నారు. పాలకొండ పట్టణం 19వ వార్డులో స్వచ్ఛతా హీ సేవ, స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 100 రోజుల్లో రాష్ట్రాన్ని గాడిలో పెట్టిన ఘనత ముఖ్యమంత్రికి దక్కుతుందన్నారు. అన్ని సంక్షేమ పథకాలు త్వరలో అమలు చేస్తామన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు, తెదేపా పట్టణాధ్యక్షుడు సంతోష్‌కుమార్, మెప్మా, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు అర్హత

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: పార్వతీపురానికి చెందిన ఆరుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడల్లో తైక్వాండో పోటీలకు అర్హత సాధించారు. బుధవారం విజయనగరంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్-14, 17 విభాగాల్లో ఎం.ఖావిష్, ఆర్.రోహిత్, కె.భూపతి నాయుడు, దేవి సంఘవి, ఆర్.విజయ్‌కుమార్, బి.హర్షవర్ధన్ బంగారు పతకాలు సొంతం చేసుకున్నారు. వీరు రాష్ట్ర స్థాయికి అర్హత సాధించారని శిక్షకులు ఎం.రవికుమార్, కోటేశ్వరరావు తెలిపారు.



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న శిక్షకులు

ప్రజాభీష్టం మేరకే కూటమి పాలన


ప్రచారం చేస్తున్న పడాల భూదేవి, నాయకులు

పాలకొండ, న్యూస్‌టుడే: ప్రజాభీష్టం మేరకే కూటమి పాలన సాగుతుందని పాలకొండ తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి పేర్కొన్నారు. మండలంలోని ఎల్ఎల్‌పురం, పెదకోటిపల్లి, భాసూరు గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంతో ముందుకు వెళ్తుందన్నారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు, నాయకులు సుమంత్, వెంకటరమణ, సింహాద్రి పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బడిదేవర అనుమతుల రద్దుకు డిమాండు

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పార్వతీపురం మండలాన్ని బీడుగా మార్చే బడిదేవర కొండ తవ్వకాలను రద్దు చేయాలని, ప్రభుత్వం ప్రకటించిన రైతు సాయం రూ.20 వేలు అందించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బంటుదాసు డిమాండు చేశారు. గురువారం తహసీల్దారు కార్యాలయం వద్ద రైతులు, సంఘ ప్రతినిధులతో ధర్నా నిర్వహించారు. సమస్యల వినతిపత్రాన్ని ఉపతహసీల్దారు రమణకు అందించారు. కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు రాము, నాయకులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నాలో రైతు సంఘం ప్రతినిధులు